# పరువుపోయిన పుట్టినరోజు

"లీలా....లీలీలీలీలా...ఏయ్ లీలా? నిన్నే గదూ పిలుస్తూంటా! ఒకమాటుయిల్లా రా?" అన్నాడు ఫోంచేసి పేపరుచూస్తూ భీమారావు.

"అబ్బబ్బ! ఏమిటండీ ఆ పిలవటం. దేనికైనా హద్దుండాలి!" అంది వస్తూ కోపంగా.

" అన్నిటి పరి హద్దుండాలి" అన్నాడు నిర్లక్ష్యంగా.

"సరి కాకపోతే ఆ పిలవట మేమిటండీ"

"అయితే మన బావలాగా ఏవోయ్, ఏమయ్యా, నిన్నేనయ్యో! అనమంటావా?"

"అనండి మీకు న్యాయమైతే" అంది కూర్చుంటూ జాలిగా.

'ఒయబ్బో! సీతారామయ్యగారికూతురు న్యాయంకూడా నేర్చిందే" అన్నాడు వెటకారంగా.

"అంటే మా నాయనేం అన్యాయంచేస్తాడనుకున్నారా?" అంది రెట్టిస్తూ.

"అబ్బే, న్యాయం నయాపైసైతే సరిగ్గా అన్యాయంకూడా అంతే!"

"సరే అనుకోండి మాకేం. యిందుకా పిలిచింది" లేవబోతూ అంది కోపంగా.

"అరె కూర్చో! అసలుకారణం చెప్పనివ్వవేం? బలే మజాగా వుంటుందిలే" అన్నాడు వూరిస్తున్నట్లు.

"నా కేం అవసరంలా" అంది లేచి.

"ఆఁ మీ నాన్నకు ముందుగానే తెలిసిందట"

"మా నాన్నకా!" అంది ఆశ్చర్యంగా.

"ఆఁ మీ నాన్నకే" అన్నాడు తలవూపుతూ.

"ఏమిటండీ!" అంది కూర్చుంటూ

"నీకు ఒబ్బాయి పుడ్తాడని."

"అహోఁ మీరు యిందోమెట్టు పైకెక్కుతారని మామీద స్వారీ చెయ్యటానికి" అంది కొంచెం వెనక్కు జరుగుతూ.

"కోపపడకు అసలు సంగతి" అన్నాడు దీనంగా ముఖంపెట్టి.

"నా కేం అక్కర్లేదులేండి మీ అసళ్ళుగిసళ్ళు"

"ఇదుగో చెప్పేస్తున్నా....తర్వాత చింతిస్తావు వింటంటే రాత్రికి నిద్రపట్టదు. అది మీ నాన్నకు తెలిస్తే ఆ రాత్రికి నాకు నిద్రపట్టదు"

"సరే. అయితే చెప్పండి చూద్దాం" అంది ఉత్సాహం కనపరుస్తూ.

"ఆఁ చెప్తున్నా....రేపు..నీ—పుట్టినరోజు" అనేటప్పటికి లీలముఖం సూర్యోదయంకి కలువలాగా వుంది.

"ఎక్కిరించండి, ఎక్కిరించండి మీకే ఆడపిల్లలు పుడ్తారు" అంది కోపంగా.

"నాకా, చా—చా యిక కంటే నీవేకనాలి ఆడపిల్లల్ని" అన్నాడు నవ్వుతూ హేళనగా.

—లీల ... యిద్దరూ నవారు.

లీలకు పుట్టినరోజంటే కోపంరావటానికి ఒక కారణంవుంది. క్రిందటి సంవత్సరం లీల కొట్టినరోజుపండుగ ఆదివారం వచ్చింది. భీమారావు క్రిందటిరోజు తెచ్చిన జార్జెట్‌చీర కట్టుకుని వెల్‌వెట్ జాకెట్ వేసుకుంది. హెయిర్‌ను "రాజకుమారి టపు"లో డ్రస్ చేసింది. అచ్చంగా అప్సరసలా అతగాడిముందు సాక్షాత్కరించింది. అలికిడివిని భీమారావు పేపరుచూస్తున్నవాడల్లా పేపరుమడిచి ఒకసారి చూశాడు. మళ్ళీ కళ్ళు నలుచుకొని చూశాడు.

లీల యీ హంగామా చూసి "నీ కంటి కెట్లావున్నానండీ" అంది.

'ఆఁ అదే మాటలురాక ఆలోచిస్తున్నాను" అన్నాడు సీరియస్‌గా.

"అవును పాపం చాలా అవస్థ పడుతున్నారు" అంది హేళనగా కూర్చుంటూ.

## "శి వా ని"

"లీలా....మాటలసొంపు కుదరటంలా...... కవినన్నా కాకపోతినే! అయినా నిన్నుచూస్తే కవిత్వం రాం దెవరికి? నిజంగా నీవు ... లీలా నీవు — న వ్వే దేవలోకంలోనుంచి దిగివచ్చిన అందాల అపురూప అప్సరసవా? శ్రీమతీ.. రేపటినుంచీ నిజంగా అందంఅంటే నీతో సరిచూడాలి అంతే.. అంటే....అంటే...అందానికి గీటురాయివన్నమాట. ఇక ఎవ్వర్ని పోల్చినా. అహఅందం అనేమాటవస్తే నీతోనేనా?"

"ఆఁ ఆఁ ఇకఆపండిపిచ్చిగా మార్తుందేమో"

"మార్తుంది. మారం దెవరికి" అన్నాడు అదే ధోరణిలో.

'నమస్కారం చేస్తాను పట్టండి. నాకు మళ్ళా పన్నున్నాయి! అంది లేచి నుల్చొని.

' అహ ఒకమాట చెప్తా. దాని కొప్పుకుంటే నమస్కారం పుచ్చుకుంటాం" అన్నాడు సీరియస్‌గా పోజుపెట్టి.

"నే నెప్పుడు మీ మాట కాదన్నానండీ" అంది దీనంగా.

"ఇప్పు డంటావేమోనని అనుమానం?"

"ఒట్టు. కాదను. యిక చెప్పండి"

"అయితే యిక పెట్టొచ్చు...శీఘ్రమేవ సుపుత్ర ప్రాప్తిరస్తు."

'ఒయబ్బా! మీకు బలే కోరికే" అంది కూర్చుంటూ యిక చెప్పండి అన్నట్లుగా.

"ఇప్పుడు నేను చెప్పబోయేది ఏమిటంటే, నీవు యీ పేపరుచూస్తూ యిక్కడే కదలకుండా కూర్చోవాలి"

"సరే బాగానేవుంది. ఇంటో?"

"దానికేగా యీ కుక్‌ఏం చేయబోవుచున్నవాడు."

"ఏ అదేమిటండీ?"

"ఏమిటా, నీ పుట్టినరోజుకు బహుమానం అనే పేరుతో మీకష్టం స్వానుభవంగా తెలుసుకుందామని."

"ఇంక మీ మాటలు చాల్లే వూరుకోండి నే పోవాలి"

"ఇదుగో ఒట్టు మర్చిపోతున్నావ్, తర్వాత చాలా యిబ్బందిపడ్తావ్ జాగ్రత్త" అన్నాడు ఒట్టంటే తప్పకూడదని తెలియబరుస్తూన్నట్లు.

"సరే. కానివ్వండి ఏంచేస్తాం" అంది లోపల భయంగావున్నా.

భీమారావు వంటపనికై యింట్లోకి వెళ్ళాడు. లీల అట్లానే ఆలోచిస్తూ కూర్చుంది. అనేక వూహలు మనసులో మెదిలినయి· "ఇప్పు దెవరైనావస్తే ఆయన పరువు నా పరువు పోదా? ఎబుగురూ ఆ అమ్మాయి మొగుడుచేత వంట చేయించుకుంది అనరా? ఏం వాళ్ళుమటుకు చేయించుకోటంలా ఏదైనా యిబ్బందివస్తే? అవును. తనకే యిబ్బంది రాలేదుగా. అయినా ఆయనన్నారని వూరుకోవటం ఏమిటి" అనుకొని గబ్‌మనిలేచి వంటింట్లో కి వచ్చింది. అప్పుడే అన్నం ఎసరు, పప్పు, పులుసు అన్నీచేస్తూ బిజీగావున్న భీమారావు లీలనుచూసి "అదేమిటి. ఆఁ అదేమిటంట నీవు యిక్కడి కెందుకొచ్చినట్లు ఒట్టు మర్చిపోయావూ?"

'ఒట్టులేదు, గిట్టులేదు"అందిమూతివిరిచి.

'ఆఁఒట్టు ఎగగొడ్తే దీవెన ఫలించదు. అప్పంగా ఆడపిల్లలు పుడ్తారు, జాగ్రత్త. పద"అన్నాడు.

ఆ మాట అనేటప్పటికి కాస్త బయమేసింది. సరేలే చెయ్యనీ అనుకొని బయటి కొచ్చింది.

మళ్ళా వస్తుందేమోనని తలుపు గడియా వేసి మళ్ళా వంటలో నిమగ్నుడయ్యాడు.

లీల యిక గత్యంతరంలేక వచ్చి సోఫాలో కూర్చుంది. అదేపనిగా ఆలోచిస్తున్నది. ఒక అరగంట గడిచింది. లీలకు తెలియకుండానే నిద్రపట్టింది.

"అమ్మాయి...లీలా....లీలా" అని పిలుపు వినపడుతూ తలుపు చప్పుడయింది. లీల ఉలిక్కిపడి లేచి తలుపుదీసి "రానాన్నా', అంది.

"ఏం అమ్మ యిప్పుడు నిద్రపోతున్నావా" అన్నాడు సీతారామయ్యగారు.

"లేదునాన్నా. అందరూ బాగున్నారా?" అంది ముఖం తుడుచుకుంటూ.

'ఆ అందరూ బాగానేవున్నారు భీమారావేడి?'

భీమారావు అనేటప్పటికి లీలకు గుండె జారిపోయిన ట్లయింది.

"బజారు కెళ్ళారు. నేను వంటచేసి ఆయన కోసం చూస్తున్నా కాళ్ళు కడుక్కుందురుగాని నీళ్ళు తెస్తా కూర్చోనాన్నా!! అంటూ వంటింటి వైపుకు పరుగుదీసింది.

"ఏమండోయి మిమ్మల్నే తలుపు" అంది గాభరాగా.

భీమారావు తలుపుదీసి పులుసులో తిరగమోత పెట్టిపోతూ "ఏం మళ్ళా వచ్చావ్" అన్నాడు.

"ఏమిటా పరువు దీసేశారు. మా నాన్న వచ్చాడు" అంది.

'వచ్చాం! అయితే ఆ మాటలు యీ మాటలు చెప్తూవుండు. నేను తిరగమోతవేసి దొడ్డి వాకిట వస్తా" అని లీలను పంపించి తలుపు గడియవేశాడు.

లీల నీళ్ళచెంబు దీసుకొని తిన్నగా వరండాలోనికి వచ్చింది. ఏదో సంభాషణ అస్పష్టంగా వినవచ్చింది.

*　　*　　*

"అమ్మాయి వంటకూడా చేసింది" అన్నది శీతారామయ్యగారి గొంతు.

వచ్చిన లీల అలానే నిల్చుండిపోయింది. ముఖాన చెమట చాలా అధికంగా పోసింది. కాళ్ళు భూమిమీద తేలిపోయినాయి. ఆ తెచ్చిన నీళ్ళు దీసుకొని వారివద్దకువెళ్ళి "మామగారూ కాళ్ళు కడుక్కోండి" అంది నంగిగా.

"ఏం అమ్మా వంట్లో సుస్తీగావుందా" అన్నాడు నీళ్ళు దీసుకుంటూ.

"లేదండీ" అంది అస్పష్టంగా.

"ఏమయ్యా శీతారామయ్యా మీ అమ్మాయి మావాణ్ణి పుట్టినరోజుకూడా యింట్లోవుండనీయటం లేదయ్యా" అన్నాడు కాళ్ళు తుడుచుకుంటూ హాస్యదోరణిలో.

"మీవాడు మా అమ్మాయిని పుట్టినరోజుకూడా వంటరిగా యింట్లోవదలి పిచ్చిదాన్నిగా తయారు చేస్తున్నాడు,' అన్నాడు అదేదోరణిలో కొట్టేస్తున్నట్లు.

"ఏం అమ్మాయి మీ నాన్నతోనే ఏకీభవిస్తావా" అన్నాడు.

లీల నవ్వలేక నవ్వలేక నవ్వాను అనిపించింది.

"ఇదుగో అమ్మాయి మీ ఆయనతో కాదు కాని నాకు చాలా పన్లున్నాయి నాకువడ్డించమ్మా. యిదుగో వీతో భోంచేసి చాలారోజు లైంది కాని మీ అల్లుడికి నే చెప్తాలే త్వరగా కాళ్ళుకడుక్కొనిరా" అన్నాడు చొక్కా తగిలిస్తూ.

'సరేనండి" అంది తప్పక లీల. తిన్నగా కదిలింది. మధుసూదనరావుగారు అనుసరించాడు. ఆమెగుండె ఎక్స్‌ప్రెస్‌గా పరుగిడుతున్నది. కంగారులో కాలు కదపలేకపోతున్నది. ఆగమంటానికి తాహతుచాలక అల్లానే వంటింటిదాకా వచ్చింది. ధైర్యంచేసి ప్రాణాల్ని బిగపట్టి "మీ రుండండి నే బట్ట మార్చుకవస్తా" అన్నది.

మధుసూదనరావుగారు "సరేనమ్మా" అని వరండావైపుకు వెళ్ళాడు.

"ఏమండోయి తలుపు" అందిరుద్ధకంటంతో భీమారావు తలుపుదీసి "ఓ. కె. ఇక మీ నాన్న కాదుకదా బ్రహ్మకూడా మనల్ని చూడడు. వస్తా" అన్నాడు.

" చాల్లే వూరుకోండి. చంపేశారు " అంది మొఖం అదోలా పెట్టి.

"ఏం మీనాన్నచూశాడా? పోనీఅదీ మంచిదే"

"మీ నాన్నగారు అన్నం పెట్టమని యిందాకా వచ్చారు"

"అమ్మబాబోయి మా నాన్నే" అని గెంతువైచాడు కంగారుగా.

"బట్ట మార్చుకోవాలి అని పంపించా"

"ఇప్పు డేం చేయాలి?"

"నా కేం తెలుసు మీరేగాయింతపని చేశారు. ఆఖరికి నా పరువు దీశారు' అంది, కళ్ళవెంట నీళ్ళు తిరిగినయి.

"అబ్బా! యిప్పుడు నువ్వే అట్లావుంటే ఎట్లా? నాకు ఏదన్నా వుపాయం చెప్పవే" అన్నాడు, దీనంగా.

"అయితే మీరు యీ అరమరలో కూర్చోండి" అంది పోపులు పప్పుళ్ళు సామాన్ల పెట్టె అలమర చూపిస్తూ.

"అమ్మో దాంట్లో నా వళ్ళంతా మండదూ? బద్దంకులు. అబ్బా వాసన" అన్నాడు ముఖం ముడుచుకొని.

"అయితే అదుగో దారి. మీ నాన్నగారు అక్కడే వున్నారు దర్జాగా దయచెయ్యండి" అంది వాకిలివంక చూపిస్తూ.

"సరేలే ఏం చేస్తాను. కూర్చుంటా త్వరగా పెట్టు లేకపోతే చస్తా" అంటూ ప్రాణం బిగబట్టుకొని అలమరలో కూర్చున్నాడు. లీల తలుపు గట్టిగావేసి బట్టమార్చుకొని "రాండిమామగారూ" అంది వడ్డించి.

అంతవరకూ ఎప్పుడా అని కాచుకొనివున్న మధుసూధనరావుగారు మాటతోనేవచ్చి కూర్చున్నారు. అంతలోనే కాళ్ళు కడుక్కొని శీతారామయ్యగారు కూడా వచ్చి కూర్చున్నారు.

భోంచెయ్యటం మొదలుపెట్టారు.

"ఏమయ్యోయి శీతారామయ్య నేను మావాడు బి. ఏ. చదివేటప్పుడు వాడిదగ్గరకు వెళ్ళాను. మావాడు ఆరోజు నిజంగా భీమపాకం దించాడనుకో. యిదుగో అమ్మాయి ఒక్కసారి వాడిచేత చేయించు. ఆఁ అయినా నేర్పేదేమోతే కాపీ కొట్టి నట్లు దించావు."

లీల ఏ భావం స్ఫురించనివ్వకుండా నింపాదిగా వుంది. శీతారామయ్యగారు "పులుసు" అన్నాడు.

లీల తెచ్చి యిద్దరికి వడ్డించింది.

,'అమ్మాయి దీంట్లో కారం వెయ్యలేదే" అన్నాడు మధుసూధనరావు. లీలకు గాభరా ఎత్తింది. ఏం లోచక కొయ్యబొమ్మలా నిల్చుంది. భీమారావు మామయ్య వచ్చినప్పుడు మర్చానే అని నాలుక కొరుక్కున్నాడు. పోపులడబ్బా కులతో కుస్తీపడుతున్నాడు.

"ఏమ్మా కారం లేదా" అన్నాడు శీతారామయ్యగారు.

"వుందండీ" అని తప్పక అలమర దీసింది.

ముచ్చుమటలుపోసి మసి ముఖానికయి కూర్చున్న భీమారావుకు ఎంతఆపుకున్నా ఆగకుండా రెండు తుమ్ములొచ్చినయి. ఆధ్వనికి యిద్దరూ తెల్లబోయారు. లీల సిగ్గుతో తల వంచుకుంది. స్వేదబిందువులతో ముఖంమసితో ప్రత్యక్షమైన అల్లుణ్ణి, కొడుకును చూసి యిద్దరూ పెద్దగా నవ్వారు.

"వంట చేయించింది కాకుండా శిక్షకూడా విధించిందే' అన్నాడు మధుసూధనరావుగారు నవ్వుతూ. భీమారావు బాత్‌రూమ్‌కి గబగబా వెళ్ళాడు. లీలముఖం కందగడ్డలావున్నా' చిన్నగా భర్తగారి ఆకారానికి జాలిగా నవ్వింది. అప్పటినుంచి లీలకు పుట్టినరోజంటే ఆ సంఘటన జ్ఞాపకం వస్తుంది. ఒళ్ళు అభిమానంతో గగుర్పొడుస్తుంది. అంతలోనే తలుపుచప్పుడయింది. లీల తలుపుతీసింది. "రానాన్నా" 'రా అత్తయ్యా' యిద్దరూ అన్నారు. "వస్తున్నానోయి ఈదఫా వారంరోజులు నీ వంట తినాలని మీ అమ్మను తెచ్చా!" నన్నాడు మధుసూదనరావుగారు.

అంతా ఒక్కసారిగా నవ్వారు.



ఏ క శి లా ర థ ం